

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల: ఈనెల 19న నిర్వహించనున్న హరితోత్సవం క్యాలెండర్‌ను కలెక్టర్ యాస్మిన్ బాషా శుక్రవారం ఆవిష్కరించారు.



ఆర్టీసీ డిపో సందర్శన

కోరుట్ల: ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ సుచరిత శుక్రవారం స్థానిక డిపోను శుక్రవారం సందర్శించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు వడగాలులు వీచే అవకాశం ఉంటుంది. ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

రైస్ మిల్లులో వడ్లు మాయం

కోరుట్ల: పట్టణ శివారులోని జయనర్సింహా రైస్‌మిల్లులో వడ్ల సంచులు మాయమైనటు పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు జయనర్సింహా రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు తనిఖీచేశారు. టెక్నికల్ అసిస్టెంట్ వంశీ లెక్కల ప్రకారం.. సుమారు 66వేల వడ్ల సంచులు ఉండాల్సి ఉండగా 24వేల సంచులు తక్కువగా ఉన్నట్లు తేలింది. ఈలెక్కన 4వేల క్వింటాళ్ల వడ్లు మాయం అయినట్లుగా పౌర సరఫరాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ యాదవ్, ఆనంద్, డెప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. ఈ వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు వివరించారు.

రూ.కోటి పరిహారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: అగ్నిప్రమాదంలో ఈత, తాటిచెట్లు కాలిపోయిన గీత కార్మికులకు ప్రభుత్వం రూ.కోటి పరిహారం చెల్లించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. చల్‌గల్ గ్రామంలో అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఈత, తాటిచెట్లను శుక్రవారం ఆయన పరిశీలించి గీత కార్మికులతో మాట్లాడారు. ఇప్పటికే ఊరూరా బెల్టుషాపులతో గీత కులవృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, చాలామంది పూటగడవని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఇలాంటి వారి ఉపాధికి భరోసా కల్పించాలని కోరారు. గీతకార్మికుల విన్నపం మేరకు బావి పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.5 లక్షల మంజూరుకు జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర మారుతిగౌడ్, సభ్యులు గాజర్ల శంకరయ్య, అంజయ్య, బుచ్చయ్య, ఎల్లాగౌడ్, వెంకటరాజం, అనిల్, జలేందర్, మహేశ్, శ్రీనివాస్, దుబ్బయ్య, తిరుపతి పాల్గొన్నారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న కన్వీనర్ అశోక్

జగిత్యాల: స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైందని పాలిసెట్ కన్వీనర్ అశోక్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు సకాలంలో కళాశాలకు చేరుకోవాలన్నారు. ఒక జిరాక్స్ సెట్, ఒరిజినల్ సెట్ తీసుకుని స్లాట్‌బుకింగ్ టైంలో కళాశాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు వేయండి



మాట్లాడుతున్న సురేశ్‌కుమార్

జగిత్యాలఅగ్రికల్చర్: వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం వచ్చే పంటలు పండించాలని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ సూచించారు. మోరపల్లిలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, మొక్కజొన్నతోపాటు అల్లం పంటకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఏటా రెండు సీజన్లలో వరి పండిస్తే భూసారం దెబ్బ తిని దిగుబడులు రావన్నారు. దీనికి తోడు తెగుళ్లు విజృంభిస్తాయన్నారు. ఆయిల్ పాంతోపాటు కూరగాయలు సాగు చేయాలని కోరారు. సింగిల్‌విండో చైర్మన్ పత్తి రెడ్డి మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ బోల్లె సత్తమ్మ, ఎంపీటీసీ భూమరెడ్డి, ఏఈవో శ్రీనివాస్, వార్డు సభ్యులు తిరుపతి, లింగన్న పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

జగిత్యాల: రాయికల్ మండలం అల్లీపూర్ కోనమ్మ చెరువులో ముదిరాజ్‌లు అక్రమంగా చేపలు పట్టారని, వారినుంచి తమకు పరిహారం ఇప్పించాలని మత్స్యా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కోరారు. శుక్రవారం స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కోనమ్మ చెరువుపై మత్స్యా పారిశ్రామిక సహకార సంఘం 1994లో కే323 నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకుందన్నారు. మత్స్యశాఖకు ఏటా లీజు చెల్లించి చెరువులో చేపలు పట్టుకుని ఉపాధి పొందుతున్నామని తెలిపారు. సంఘంలో సభ్యులు కాని వారు 10 టన్నుల చేపలు పట్టుకున్నారని ఆరోపించారు. అశోక్, రాజం, నారాయణ, ప్రశాంత్, రవి ఉన్నారు.

పైసలిస్తేనే.. 'ఫిట్‌నెస్'

కోరుట్ల: అమ్మానాన్నలకు బైబై చెప్పి బడికి బయలుదేరుతున్న చిన్నారులను భద్రంగా గమ్యస్థానాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలది. ఈ బస్సులకు 'ఫిట్‌నెస్' జారీచేయాల్సిన రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఆర్టీఏ) కార్యాలయాల్లో దళారుల దందా జోరుగా సాగుతోంది. ఒక్కో వాహనానికి రూ.8వేల వరకు మామూళ్లు ఇస్తేనే సర్టిఫికెట్ జారీ అవుతోంది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. తాము అధికారులకు కమీషన్లు ముట్టజెప్పాల్సి వస్తోందని దళారులు బాహాటంగానే చెబుతున్నారు. చేతులు తడిపిన యాజమాన్యాల వాహనాలకు సర్టిఫికెట్లు జారీచేస్తుండగా.. కరోనా కష్టాల నుంచి ఇంకా కోలుకోని కొన్ని స్కూల్ యాజమాన్యాలు.. ఏజెంట్లు అడిగినంత ఇవ్వలేక అవస్థలు పడుతున్నాయి. ఫలితంగా బడులు ప్రారంభమైనా ఇప్పటివరకు సగం బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెటు జారీ కావడం గమనార్హం.



సాక్షి ఫోకస్



కోరుట్ల ఎంవీఐ కార్యాలయం వద్ద ప్రైవేట్ స్కూల్ బస్సులు

- ఒక్కో స్కూల్ బస్సుకు రూ.8వేల వరకు వసూలు
- ఆర్టీఏ కార్యాలయాల్లో దళారుల దందా
- ఇదేమిటని ప్రశ్నిస్తే.. అధికారులకు కమీషన్లంటున్న వైనం
- పాఠశాలలు ప్రారంభమైనా సగం వాహనాలకే సర్టిఫికెట్లు

సగమే ఫిట్‌నెస్..

- జిల్లాలో మొత్తం స్కూల్ బస్సులు 674 ఉన్నట్లు అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు.
- ఇందులో స్క్రాప్ కింద 180 బస్సులను యాజమాన్యాలు మూలన పడేశాయి.
- మిగిలిన 494 బస్సులకు యజమానులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సిఉంది.
- కానీ, ఇప్పటిరకు ఇందులో 220 బస్సులకే ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయి

ఇవీ నిబంధనలు..

ఏటా బస్సు కండీషన్, 50ఏళ్ల లోపు వయసు ఉన్న డ్రైవర్, మెడికల్ కిట్, టూల్ కిట్, అదనంగా టైర్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బీమా, పొల్యూషన్, గ్రీన్ ట్యాక్స్, డ్రైవర్ లైసెన్స్‌లు కచ్చితంగా కలిగి ఉండాలి. బస్సుకు హారన్, హెడ్‌లైట్స్, సీటింగ్, హ్యాండ్ బ్రేక్, ఫుట్‌బ్రేక్, అద్దాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, నాలుగు దిక్కులా నంబరు ప్లేట్లు ఉండాలి.

ఏజెంట్ల వసూళ్ల దందా..

- జగిత్యాల, కోరుట్ల ఆర్టీఏ కార్యాలయాల వద్ద ఏజెంట్లు ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం రూ.8–రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.
- ఫిట్‌నెస్ రెన్యూవల్, ఇతర ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు కేవలం రూ.6 వేల వరకు చలానా కోసం ఖర్చవుతుంది. కానీ, దళారులు అదనంగా రూ.2వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.
- అదనంగా వసూలు చేస్తున్న డబ్బులు 'సార్లకు' ఇవ్వాలని దళారులు బహిరంగంగా చెబుతుండటం గమనార్హం.
- అసలే కరోనా కష్టాలు, కార్పొరేట్ సంస్థల రాకతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు పోటీని తట్టుకోలేక చాలావరకు నష్టాల్లో నడుస్తున్నాయి.
- వాహనాల ఫిట్‌నెస్ కోసం చెల్లించాల్సిన డబ్బులకు మించి దళారులకు ఇవ్వడానికి అవస్థలు పడుతున్నాయి.
- ఫలితంగా ఇప్పటికే పూర్తికావాల్సిన ఫిట్‌నెస్ ప్రక్రియనత్తనడకన సాగుతోంది. వాహనాల ఫిట్‌నెస్‌పై అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి



"ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం ప్రైవేట్ బస్సుల పరిశీలన ప్రక్రియ వేగంగా చేపట్టాం. ఇప్పటికే స్కూల్ యాజమాన్యాలకు నోటీసులు జారీచేశాం. కోరుట్ల కార్యాలయ పరిధిలో సగం వాహనాల ఫిట్‌నెస్ పూర్తయ్యింది. స్కూల్ యాజమాన్యాలు మాకు సహకరిస్తే ఈ ప్రక్రియ త్వరగా ముగుస్తుంది. ఏజెంట్లను ఆశ్రయించి అదనంగా డబ్బులు, కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే బస్సును పరిశీలించి సర్టిఫికెట్లు జారీచేస్తాం."

– రంజిత్, ఏంవీఐ, కోరుట్ల

పట్టణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, వేదికపై కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్సీ ఎల్.రమణ

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: పట్టణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ టౌన్ ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం సీఎం కేసీఆర్‌కు రెండు కళ్లు అన్నారు. జగిత్యాలలో రూ.50 కోట్లతో ప్రధాన రహదారులు, జంక్షన్లు, మురుగు నీటి కాలువల నిర్మాణం చేపట్టామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా రూ.36.42 కోట్లు వెచ్చించి 110 కి.మీ. పొడవైన పైప్‌లైన్ నిర్మించి, పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి, రెండు రిజర్వాయర్లు తవ్వించి, 5,426 నల్లా కనెక్షన్లు ఇచ్చామని అన్నారు. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, తాగు నీరు, రోడ్లు, మురుగునీటి కాలువలు వంటి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులు, పాలకవర్గంపై ఉందన్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు లేకుంటే పట్టణంలో సుందరీకరణ ఉండదన్నారు. కోరుట్ల మున్సిపాలిటీకి అవార్డు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మున్సిపల్ అభివృద్ధి పనులపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్, అధికారులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగుల ఆటాపాట



ప్రదర్శన ఇస్తున్న కళాకారుడు

రంగవల్లులు.. ర్యాలీలు..

కాగా, టౌన్‌హాల్‌లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కొత్తబస్టాండ్ నుంచి టవర్‌సర్కిల్ మీదుగా గంజ్‌రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్‌లో తెలంగాణ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్




అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఈశ్వర్

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం

ధర్మపురి: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సాంఘి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందిన పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరమన్నారు. నియోజకవర్గంలోని 193 మందికి రూ.59.24 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు. అంతకుముందు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ధర్మపురిలో పట్టణ ప్రగతి వేడుకలు ప్రారంభించారు. పట్టణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ రూ.వేల కోట్లు మంజూరు చేస్తున్నారని అన్నారు. తక్కువ జనాభా గల ధర్మపురి మేజర్ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చి టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.160 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ప్రారంభించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ పాల్గొన్నారు.

కార్మికురాలికి పురస్కారం



అవార్డుతో కలమడుగు రాధ

బుగ్గారం(ధర్మపురి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన వారికి జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం అవార్డులు అందజేసింది. పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో పలువురు పారిశుధ్య కార్మికులకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అవార్డులు అందించారు. ఈ క్రమంలో బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న కలమడుగు రాధకు ఉత్తమ కార్మికురాలి అవార్డు అందించారు. అలాగే జిల్లాస్థాయిలో బుగ్గారం మండలం నుంచి శెకెల్ల, మద్దునూర్ గ్రామాల సర్పంచులు ఉత్తమ సర్పంచులుగా ఎంపికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

ఎంపీపీ ఇంటి ముట్టడికి యత్నం



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గంగపుత్రులు

- చేపల పండుగపై గంగపుత్రుల ఆగ్రహం
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన చేపల పండుగ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి తమ మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారని ఆరోపిస్తూ గంగపుత్రులు శుక్రవారం వెల్లుల్లలోని ఆయన ఇంటిని ముట్టడించడానికి యత్నించారు. వివరాల్లోకి వెళితే.. మత్స్య సహకార సంఘం రాష్ట్ర చైర్మన్‌గా ముదిరాజ్ కులానికి చెందిన వ్యక్తిని నియమించడాన్ని నిరసిస్తూ గంగపుత్రులు చేపల పండుగను బహిష్కరించారు. అయితే ఎంపీపీ సాయిరెడ్డి కొండ్రికర్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వల గొడుగుల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ప్రత్యేక సందర్భాల్లోనే గంగపుత్రులు జరపడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, కొండ్రికర్లలో ముదిరాజ్‌లతో ఎంపీపీయే ప్రదర్శన చేయించారని గంగపుత్రులు భావించారు. ఇది తమ మనోభావాలను దెబ్బతీసిందనే ఆగ్రహంతో ఎంపీపీ ఇంటి ముట్టడికి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. దీనికి పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో గంగపుత్రులు వెల్లుల్లలోని సంఘ భవనానికి తరలివచ్చారు. అక్కడి నుంచి సాయిరెడ్డి ఇంటిని ముట్టడించడానికి ప్రదర్శనగా వెళ్తుండగా, అప్పటికే సమాచారం అందుకున్న సీఐ లక్ష్మీనారాయణ పోలీసు సిబ్బందితో కలిసి మార్గమధ్యంలో ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఆందోళన చేయవద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా, వారు వెనక్కి తగ్గకుండా అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఎంపీపీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎంపీపీ తమవద్దకు వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చివరకు సీఐ సూచన మేరకు సాయిరెడ్డి 'వల గొడుగుల ప్రదర్శనలో తన ప్రమేయం లేదని.. ఒకవేళ ఆ చర్యతో గంగపుత్రుల మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నానని' వీడియో ప్రకటన విడుదల చేశారు. దీనిని పోలీసులు గంగపుత్రులకు చూపించడంతో వారు ఆందోళన విరమించారు.

ధాన్యం డబ్బులు పడ్డాయి!

- ఉమ్మడి జిల్లాకు రూ.1,890 కోట్లు విడుదల
- శుక్రవారం ఒక్కరోజే రూ.700 కోట్లు
- 20వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి



ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా రైతులకు రాష్ట్రప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎప్పుడెప్పుడా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్న ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయి. శుక్రవారం పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా రూ.3వేల కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాకు రూ.700 కోట్లు ఇచ్చింది. ఈసారి అకాల వర్షాలు, వడగళ్ల వానలతో అతలాకుతలమైన రైతు.. దిగుబడి తగ్గి తల్లడిల్లిపోయాడు. అనంతరం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు వరుణదేవుడు ముప్పతిప్పలు పెట్టాడు. ఇవి చాలవన్నట్లుగా కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు, నిర్వాహకులు రైతులను తాలు, తేమ పేరుతో క్వింటాలుకు 9 కిలోల నుంచి 11 కిలోలు తరుగు పేరిట వేధించారు.


రైతుల ఖాతాల్లో జమైన సొమ్ము(రూ.కోట్లలో)

జిల్లా	శుక్రవారం	ఇప్పటివరకు	లక్ష్యం
కరీంనగర్	210	510	600
జగిత్యాల	250	600	853
సిరిసిల్ల	50	330	511
పెద్దపల్లి	190	450	694
మొత్తం	700	1,890	2,658

ఇప్పటివరకు రూ.1,890 కోట్లు..

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుంచి పౌరసరఫరాలశాఖ నిరంతరం కొనుగోలు ప్రక్రియను చేపట్టింది.
- మధ్యలో అకాల వర్షాలు, వడగండ్లు ఇబ్బంది పెట్టినా.. రైతులకు సమయానికి డబ్బులు ఇవ్వాలన్న లక్ష్యంతో ఎప్పటికపుడు ఖాతాల్లో డబ్బులు జమచేసింది.
- ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాకు రూ.1,890 కోట్లు విడుదల చేసింది.
- కరీంనగర్‌లో 59,186 మంది రైతుల వద్ద మూడులక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.510 కోట్లు చెల్లించింది.
- జగిత్యాలలో 60,000 మంది నుంచి 41.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.600 కోట్లు ఇచ్చింది.
- సిరిసిల్లలో 2.45 లక్షల మంది నుంచి 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ.330 కోట్లు జమచేసింది.
- పెద్దపల్లి జిల్లాలో 47,584 మంది రైతుల వద్ద 3.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.450 కోట్లు రైతులకు అందజేసింది.
- ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నప్పటి నుంచే వరి సాగులో మేటిగా ఉండేది. తెలంగాణ వచ్చాక సాగు విస్తీర్ణం, ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో ఉమ్మడి తన రికార్డులను తానే తిరగరాస్తోంది.

ఆదివారంతో కొనుగోళ్లు పూర్తి



రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ ప్రక్రియ ఆదివారానికి పూర్తవుతుంది. ఆదివారంతో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిచేసి, 20వ తేదీనాటికి డబ్బులు రైతుల ఖాతాల్లో వేసేలా చర్యలు చేపట్టాం. సీఎం ప్రవేశపెట్టిన 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుల వద్ద చెంతనే కొనుగోలు కేంద్రాలు వంటి రైతు అనుకూల విధానాలతో రాష్ట్రంలో దిగుబడి గణనీయంగా పెరిగింది.

– గంగుల కమలాకర్, పౌరసరఫరాల మంత్రి

కాళేశ్వరంతో పెరిగిన దిగుబడి



రాష్ట్రంలో వరి కొనుగోలు ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. రెండు రోజుల్లో మొత్తం కొనుగోళ్లు, డబ్బుల జమ ప్రక్రియ కూడా ముగుస్తుంది. సీఎం రైతు పక్షపాతి. కాళేశ్వరం జలాలతోనే రాష్ట్రంలో పంట దిగుబడి అనూహ్యంగా పెరిగింది. ఎంత పంట వచ్చినా కొనుగోలుకు వెనకాడవద్దని సీఎం చెప్పారు.

– సర్దార్ రవీందర్‌సింగ్, చైర్మన్, పౌరసరఫరాల శాఖ

క్లుప్తంగా

ఉచిత శిక్షణ

జగిత్యాల: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గురుకుల ఉపాధ్యాయ, సాధారణ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబా శుక్రవారం తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యర్థులు ఈనెల 17 నుంచి 21వ తేదీలోపు నేరు బీసీ స్టడీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియమ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థుల విద్యార్హతలు ఉండాలని సూచించారు. వివరాల కోసం 96036 81993 నంబరులో సంప్రదించాలని కోరారు.

మహిళా సంఘాల ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు



మాట్లాడుతున్న డీపీఎం వెంకటేశ్

జగిత్యాలరూరల్: మహిళా సంఘాల ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు చేయించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని డీపీఎం వెంకటేశ్ అన్నారు. శుక్రవారం సెర్ప్ కార్యాలయంలో వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో మహిళా సంఘాలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేస్తున్నాయన్నారు. బ్యాంక్ లింకేజీలతో ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీ వందశాతం పూర్తిచేయాలని చెప్పారు. ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ, జగిత్యాల రూరల్‌లో 19, అర్బన్‌లో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1.95 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించామన్నారు. సీసీలు గంగారాం, రవీందర్, విద్యాసాగర్, సంతోష్, స్త్రీనిధి మేనేజర్ రాణి, సాహిత్య, సిబ్బంది పద్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ సూపరింటెండెంట్‌గా శ్రీనివాసశర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటివరకు కొమురవెల్లి ఆలయంలో విధులు నిర్వర్తించిన శ్రీనివాసశర్మ.. బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలోనే విధులు నిర్వర్తించారు. ఇక్కడినుంచి కొమురవెల్లికి బదిలీపై వెళ్లి.. మళ్లీ ఇక్కడకే వచ్చారు. అలాగే.. హనుమాన్ జయంతి సందర్భంగా సికింద్రాబాద్ గణేశ్ ఆలయం నుంచి బదిలీపై కొండగట్టుకు వచ్చిన ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌ను మళ్లీ అక్కడకు బదిలీ చేశారని అధికారులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

వేములవాడ రూరల్ : వేములవాడ మండలంలోని హన్మాజీపేటకు చెందిన సందెల ప్రసాద్ (32) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపారు. ప్రసాద్ గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి, అక్కడినుంచి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతోనే ప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

వ్యవసాయ కోర్సులకు నోటిఫికేషన్

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోని వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, హార్టికల్చర్ వంటి కోర్సుల్లో చేరేందుకు అవసరమైన నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసింది. బైపీసీ ఉత్తీర్ణులై, తెలంగాణ ఎంసెట్–2023(మెడికల్ అండ్ అగ్రికల్చర్)లో సాధించిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. వెటర్నరీ సైన్స్ కోర్సు వ్యవధి ఐదున్నర ఏళ్లు కాగా, మిగతా కోర్సుల వ్యవధి నాలుగేళ్లు.

- జూలై 15 వరకు గడువు



పొలాసలోని వ్యవసాయ కళాశాల

సీట్ల వివరాలు..

- హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లా పొలాస, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, వరంగల్ అర్బన్ జిల్లా, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏడు అగ్రికల్చర్ కళాశాలలు ఉన్నాయి.
- ఇందులో 520 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 200 సెల్ఫ్ ఫైనాన్స్(పేమెంట్) సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎస్సీ(వెటర్నరీ) కళాశాలలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, వరంగల్ అర్బన్ జిల్లా మామునూరులో ఉన్నాయి. వీటిలో 174 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎఫ్ఎస్సీ(ఫిషరీష్) కళాశాలలు : వనపర్తి జిల్లా పెబ్బేరులో 28 సీట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ముత్తుకూర్‌లో తెలంగాణ విద్యార్థులకు 11 సీట్లు కేటాయించారు.
- బీఎస్సీ(హార్టికల్చర్) కళాశాలలు : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, వనపర్తి జిల్లా మోజర్లలో ఉండగా, ఇందులో 170 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 34 పేమెంట్ సీట్లను కేటాయించారు.
- బీఎస్సీ(కమ్యూనిటీ సైన్స్) కళాశాల: హైదరాబాద్‌లోని సైఫాబాద్‌లో ఉండగా, 38 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 5 పేమెంట్ సీట్లు ఉన్నాయి. అన్ని కోర్సుల్లో పేమెంట్ సీట్లను ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు.

జూలై 15 వరకు గడువు..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫీజు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1,800, ఎస్సీ, ఎస్టీలు రూ.900 చెల్లించాలి. సీటు లభిస్తే.. వ్యవసాయ, కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు రూ.45,550, వెటర్నరీ కోర్సులకు రూ.57,500, ఫిషరీష్ కోర్సులకు రూ.43,740, హార్టికల్చర్ కోర్సులకు రూ.50,425 ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అగ్రికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.10 లక్షలు, హార్టికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.9 లక్షలు చెల్లించాలి. ఎంసెట్–2023 ర్యాంకుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు జూలై 15వ తేదీ వరకు గడువు ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దఖాలు చేసేందుకు జూలై 17వ తేదీ వరకు గడువు విధించారు.

అర్హతలివే..

- 2023 డిసెంబర్ 31 నాటికి జనరల్ అభ్యర్థులు వయస్సు 17 ఏళ్లు పూర్తయి, 22 ఏళ్లు దాటి ఉండకూడదు.
- ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు, పీహెచ్‌లకు 27 ఏళ్ల వరకు అనుమతి ఉంటుంది.
- ఒక వెటర్నరీ కోర్సుకు జనరల్ అభ్యర్థులు 17–25 ఏళ్ల మధ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు 30 ఏళ్ల వరకు ఉండవచ్చు.
- ఎకరం వ్యవసాయ భూమి ఉన్న రైతుల పిల్లలకు వెటర్నరీ కళాశాలల్లో 25 శాతం, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- అయితే, ఆ భూమి విద్యార్థి పేరిట లేదా తల్లితండ్రుల పేరిట పట్టా ఉండాలి.
- ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్ల పాటు నాన్ మున్సిపల్ ఏరియా(గ్రామీణ ప్రాంతం)లో చదివి ఉండాలి.
- బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీజేటీఎస్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను లాగిన్ కావాలి.

కర్ణాటక సీఎం దిష్టిబొమ్మ దహనం



సిద్ధిరామయ్య దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్ : హిందూ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కర్ణాటక కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ హిందూ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు వీరసావర్కర్, ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డా. హెడ్గేవార్ జీవిత చరిత్రను పాఠ్యాంశం నుంచి తొలగించాలని నిర్ణయించడమే కాకుండా గత ప్రభుత్వం అమలు చేసిన మత మార్పిడి వ్యతిరేక చట్టాన్ని తొలగిస్తున్నట్లు ప్రకటించడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఇక్కడ భారత్ సురక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, నరేందుల శ్రీనివాస్, వేముల పోచమల్లు, మాడిశెట్టి మల్లేశం, తదితరులున్నారు.

చెన్నకేశవుని భూములను గుర్తించాలని వినతి

సాక్షి ఎఫెక్ట్..

రాయికల్: పట్టణంలోని అతి పురాతనమైన చెన్నకేశవనాథ ఆలయ భూములను రెవెన్యూ అధికారులు గుర్తించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ మా ఊరు ముచ్చట్లు సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణకు వినతిపత్రం అందజేశారు. చెన్నకేశవనాథ నీ భూములెక్కడ అనే శీర్షికన శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితం కాగా వారు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణకు వినతిపత్రం అందజేశారు. చెన్నకేశవనాథ భూములను గుర్తించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



ఎల్. రమణకు వినతిపత్రం అందజేస్తున్న మా ఊరు ముచ్చట్లు సభ్యులు

గల్ఫ్ కార్మికులకు రైతుబీమా వర్తింపజేయాలి

- గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్



మాట్లాడుతున్న గల్ఫ్ జేఏసీ చైర్మన్ రవిగౌడ్

కథలాపూర్(వేములవాడ): గల్ఫ్ కుటుంబాలకు రైతు బీమా వర్తింపజేయాలని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం బీమారం మండలం లింగంపేట గ్రామానికి చెందిన గల్ఫ్ బాధిత కుటుంబ సభ్యులైన రాణవేని గంగు, వారి పిల్లలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గల్ఫ్‌లో ఉన్నవారికి రైతుబంధు డబ్బులు వారి బ్యాంక్ ఖాతాల్లో జమవుతున్నాయని, రైతుబీమా వర్తింపజేయకపోవడం సరికాదన్నారు. గల్ఫ్ కార్మికులకు రైతుబీమా వర్తింపజేసే విషయంపై దృష్టిసారించాలన్నారు. లేకపోతే గల్ఫ్ కార్మిక కుటుంబాలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

గోదాంలలో ఎరువుల నిల్వలు పెంచాలి

- ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

ధర్మపురి : రైతులకు అవసరమైన ఎరువులను గోదాంలలోనే నిల్వలు పెంచాలని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎరువులను గోదాంలలో నిల్వ ఉంచాలని సూచించారు. అనంతరం సహకార సంఘంలోని లావాదేవీలపై చర్చించారు. జైనా సహకార సంఘంలో పెద్ది సురేశ్ ఆధ్వర్యంలో 800 బస్తాల విత్తన బస్తాలను చైర్మన్ నరేశ్ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, రైతులు, తదితరులున్నారు.

మూడు ఆలయాల్లో దొంగతనం

కోనరావుపేట: మండలంలో ఎగ్లాస్‌పూర్, కోనరావుపేట, నిజామాబాద్‌లోని ఆలయాల్లో శుక్రవారం చోరీ జరిగింది. నిజామాబాద్ శివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన కేబుళ్లను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టారు. ఆలయంలోని అమ్మవారి బంగారు కండ్లు, గంటలు, సీసీ కెమెరాల సామగ్రిని ఎత్తుకెళ్లారు. హుండీలోని డబ్బులను తీసుకొని పెద్దగుట్ట సమీపంలో పడేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నేనర్ల శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో, ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ ఆలయాల్లోనూ దొంగలు గంటలు ఎత్తుకెళ్లారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

పట్టణ ప్రగతితో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: పట్టణ ప్రగతితో పట్టణాల రూపురేఖలు మారిపోయాయని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ర్యాలీ అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కోరుట్ల మున్సిపాలిటీకి మూడేళ్లుగా జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు దక్కేలా ఇదేస్ఫూర్తి కొనసాగించాలని కోరారు. మద్దుల చెరువు ట్యాంక్ బండ్‌లో బోటింగ్ సౌకర్యం కల్పించి పర్యాటకులకు సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం కార్మికులను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ పవన్, కమిషనర్ ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్‌పార్క్ ప్రారంభం

కాగా, సాయిరాంపురలో నిర్మించిన పిల్లల పార్కును ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ప్రారంభించారు. పిల్లల మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతగానో దోహద పడుతాయన్నారు. పట్టణవాసులు యోగా సాధనకు పార్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.



మున్సిపల్ సిబ్బంది ర్యాలీ

మున్సిపాలిటీల్లో మౌలిక వసతులు

మెట్‌పల్లి(కోరుట్ల): మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పట్టణ ప్రగతి అమలు చేస్తోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి మహోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు. నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలను అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి రూ.50కోట్ల చొప్పున కేటాయించారని అన్నారు. అంతకుముందు జాతీయ రహదారిపై డివైడర్లలో నాటిన మొక్కలకు నీళ్లు పట్టడం కోసం రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన డ్రిప్ వాటర్ సిస్టం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన యువతి (20) అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మహాలక్ష్మీనగర్‌కు చెందిన యువతి గురువారం మార్కెట్‌కు వెళ్తున్నానని ఇంట్లోంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

నోటీస్ జారీ

జగిత్యాల: ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న తహసీన్ సుల్తానా అనే ఉపాధ్యాయురాలు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అవుతున్నారని, నోటీస్ జారీ చేసినట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తహసీన్ సుల్తానా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారని, ఇందుకు సంజాయిషీ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.

ఇల్లు కూల్చివేసిన ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం: ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఇల్లు కూల్చివేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన సుజాతకు జగిత్యాల హనుమాన్‌వాడలో సొంతిళ్లు ఉంది. ఇంటి విషయంలో వివాదం ఉండటంతో కోర్టు ద్వారా సుజాత స్టేటస్ కో ఆర్డర్ మంజూరు పొందింది. గురువారం భారతపు చిన్న భీమయ్య, భారతపు లింగవ్వ సుజాత ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఇంటిని కూల్చివేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు.

గల్ఫ్ జేఏసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్



నియామకపత్రం అందజేస్తున్న రవిగౌడ్

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్ అధ్యక్షతన శుక్రవారం జగిత్యాలలో గల్ఫ్ జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. గల్ఫ్ జేఏసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చిలుముల రమేశ్‌ను నియమించారు. గుగ్గిళ్ల రవిగౌడ్ మాట్లాడుతూ, రవిగౌడ్ దుబాయ్‌లో 16ఏళ్లపాటు పనిచేసిన అనుభవం, గల్ఫ్ కార్మికుల కోసం చేసిన సేవలు గుర్తించి అధ్యక్షుడిగా నియమించామన్నా రు. ఉత్తర తెలంగాణ ప్రజలు 50 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తున్నారని, సు రక్షిత, చట్టబద్ధ వలసల కోసం అవగాహన, చైతన్య కార్యక్రమాలు చేపడతామని, హక్కుల కోసం పోరాడుతామని అన్నారు. గల్ఫ్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల, కార్యదర్శి బూత్కూరి కాంత, నాయకులు ఊట్నూరి రవి, దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవా సమితి అధ్యక్షుడు బాబుస్వామి పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలతో విగ్రహావిష్కరణ బాధాకరం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి : కేవలం పార్టీ కార్యకర్తలతో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం బాధాకరమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధనలో పాల్గొన్న దళిత నాయకులను మంత్రి ఈశ్వర్ పక్కనపెట్టి కేవలం పార్టీ కార్యకర్తలతో ఆవిష్కరించడం సరికాదన్నారు. మంత్రి ఈశ్వర్ అందరినీ సమానదృష్టితో చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, కుంట సుధాకర్, సింహరాజు, ప్రసాద్, తదితరులున్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

- 'మృగశిర కార్తె'లోనూ మండుతున్న ఎండలు
- వానాకాలం ప్రారంభమై పదిహేను రోజులైనా కురవని వర్షాలు
- ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు
- ఆందోళనలో అన్నదాతలు



జగిత్యాల అగ్రికల్చర్ : వర్షాకాలం ప్రారంభమై 15 రోజులు దాటినా ఇప్పటివరకు చినుకు లేదు. జూన్‌లో వర్షాలు మొదలై ఇప్పటికే రైతులు విత్తనాలు వేయాల్సి ఉన్నా.. ఇంతవరకు వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవి ముగిసినా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. మృగశిర కార్తెలో కూడా వర్షాలు దంచికొడుతున్నాయి.

గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

ఈ ఏడాది జూన్ 15 దాటినా గరిష్ట ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. బలమైన ఈదురుగాలులు, ఆకాశం మేఘావృతంగా ఉండడం తప్ప చిరుజల్లులు పడటం లేదు. రైతులు ఎరువులు చల్లి దుక్కులు సిద్ధం చేసుకున్నారు. ఈ సమయంలో మెట్టపంటలు సాగుచేయడంతో పాటు వరి పంటకు కావాల్సిన నీరు చెరువు, కుంటల్లోకి చేరేది. కానీ చినుకు జాడ లేకపోవడంతో ఆకాశం వైపు చూసే పరిస్థితి నెలకొంది.

పలు మండలాల్లో పచ్చిరొట్ట సాగు

జిల్లాలో వరిసాగు దాదాపు 3 లక్షల ఎకరాలకు పైగా సాగవుతోంది. ముందుగా పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ నెలరోజుల తర్వాత పొలంలో కలియదున్నుతారు. జిల్లాలో జగిత్యాల, గొల్లపల్లి, సారంగాపూర్, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షానికి పచ్చిరొట్ట పంటలను సాగుచేశారు. అయితే, వర్షాభావ పరిస్థితుల్లో పచ్చిరొట్ట విత్తనాలు మొలకెత్తని పరిస్థితి. బావుల్లో నీటితో రైతులు నీరు అందిస్తున్నారు.

అదును దాటుతున్న సోయా సాగు

జిల్లాలో మల్లాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల తదితర ప్రాంతాల్లో సోయాబీన్‌కు సాగు చేసేందుకు చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం జూన్ 15లోపు సోయా విత్తనాలు వేయాల్సి ఉంటుంది. విత్తడం ఆలస్యమైతే దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దీంతో, సోయా సాగు చేస్తామనుకున్న రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. బావుల్లో నీరున్న రైతులు వరి సాగు చేసేందుకు నారు మడులు సిద్ధం చేస్తున్నారు. మేడిపల్లి, కొడిమ్యాల, కథలాపూర్ మండలాల్లో బావుల్లో నీరులేక నారు మడులు సిద్ధం చేసుకునేందుకు ఆలోచిస్తున్నారు.

సాగుకు సమయం మించిపోలేదు

నైరుతి రుతుపవనాల కోసం మరికొన్ని రోజులు చూసే అవకాశం కనిపిస్తోంది. ఈసారి ఎల్‌నినో పరిస్థితులు ఉండటంతో నైరుతి రుతుపవనాలు అంతంతమాత్రంగానే ఉంటాయని పొలాస వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే పంటల సాగుకు సమయం మించి పోలేదని, రైతులు ఆందోళన చెందవద్దని సూచిస్తున్నారు.

దుక్కులు సిద్ధం చేశాం



దుక్కులు సిద్ధం చేసుకున్నాం. జీలుగ విత్తనం వేశాను. అయితే ఇప్పటివరకు వర్షాలు కురవకపోడంతో బావి ద్వారా నీరందిస్తున్నా. వర్షాలు పడగానే మొక్కజొన్న, పసుపు పంట వేయాలనుకుంటున్నా. మృగశిర కార్తె ప్రవేశించి సగం గడిచిపోయింది. వర్షం కోసం రోజూ ఎదురుచూస్తున్నా.

– ఏలేటి రాజిరెడ్డి, లక్ష్మీపూర్, జగిత్యాల రూరల్(మం)

జూలై 15 వరకు విత్తుకోవచ్చు



విత్తనాలను జూన్ 15 నుంచి జూలై 15 వరకు విత్తుకోవచ్చు. సోయా మాత్రమే ఈనెల 15 వరకు విత్తాల్సి ఉంటుంది. జూన్ మూడో వారంలో వర్షాలు కురిసినా దుక్కులు సిద్ధం చేసుకుని పంటలు వేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధనా స్థానం డైరెక్టర్, పొలాస

విత్తనాలు తెచ్చిపెట్టుకున్న..



ఈసారి రెండెకరాల్లో సోయ, మరో రెండెకరాల్లో మొక్కజొన్నతో పాటు మిగతా రెండున్నర ఎకరాల్లో పసుపు, మిర్చి పంటలను సాగు చేయాలని అనుకుంటున్నా. ఇప్పటికే దుక్కి సిద్ధం చేశా. విత్తనాలు సైతం కొనుగోలు చేశా. విత్తనం విత్తుకుందామనుకుంటే వర్షం కురవడం లేదు.– ఏలేటి

– మహేశ్‌రెడ్డి, రైతు –కొత్తదాంరాజుపల్లి